# సాక్షి
## డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 4 | మే | 2023




### వాహన సేవ రద్దు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించాల్సిన పొన్నచెట్టు వాహనం మీద ఊరేగింపు కార్యక్రమాన్ని వర్షం కారణంగా రద్దు చేశారు.



### పేద విద్యార్థులకు 'పీఎం యశస్వి'

పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం యశస్వి' పథకాన్ని ప్రవేశ పెట్టింది.

8లో

### రత్నగిరిపై వేదఘోష



రత్నగిరి శ్రీసత్యదేవుని సన్నిధి బుధవారం వేదఘోషతో ప్రతిధ్వనించింది. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో సాయంత్రం నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంత లక్ష్మీ అమ్మవార్ల సమక్షంలో వేదపండిత సదస్యం ఘనంగా జరిగింది.

8లో

## న్యూస్‌రీల్

### తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు



ఆర్యావటంలో వరి పొలాలను పరిశీలిస్తున్న జేడీఏ విజయ్‌కుమార్ తదితరులు

కాజులూరు: భారీ వర్షాల కారణంగా నీట తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ జేడీఏ ఎన్.విజయకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, బందనపూడి, తిప్పరాజుపాలెం తదితర గ్రామాలలో ఆయన అధికారులతో కలసి పర్యటించారు. వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఆర్యావటంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు తగ్గిన వెంటనే పంటనష్టం అంచనా వేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. దీనిద్వారా ఇన్‌పుట్ సబ్సిడీకి నివేదిక పంపేందుకు అవకాశం ఉంటుందన్నారు. కళ్లాల్లో తడిసిన ధాన్యాన్ని అమ్ముకోదలచిన రైతులు ఆర్‌బీకేలలో సంప్రదించినట్లయితే ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కురాడ డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క కారణంగా డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న పొలాలు ముంపుబారిన పడుతున్నాయని వెంటనే పూడికలు తొలగించేలా డ్రెయినేజీ అధికారులకు సూచిస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కె.బాబురావు, ఏఓ వి.అశోక్ పాల్గొన్నారు.

### చిన్నారికి కలైమామణి అవార్డు



సీఎం రంగసామి చేతులమీదుగా కలైమామణి అవార్డు స్వీకరిస్తున్న చిన్నారి

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం ప్రదానం చేసే ప్రతిష్టాత్మకమైన కలైమామణి అవార్డును చిత్రకళలో విశేష కృషిచేసిన ముమ్మిడి శ్రీవీరనాగేంద్ర ప్రసాద్(చిన్నారి) సీఎం రంగసామి చేతులమీదుగా అందుకున్నారు. బుధవారం పుదుచ్చేరిలో సీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జ్ఞాపికతో పాటు రూ.50వేల నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రంగసామి మాట్లాడుతూ ఏటా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి కలైమామణి అవార్డును అందిస్తున్నామని, వీటిని కొనసాగిస్తామన్నారు. చిత్రకళలో రాణిస్తున్న ముమ్మిడి శ్రీవీరనాగేంద్ర ప్రసాద్‌ను అభినందించారు.

### తిరుపతిలో పెంటాథలాన్ రాష్ట్రస్థాయి పోటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): తిరుపతిలో ఈనెల 8,9 తేదీలో మోడరన్ పెంటాథలాన్ లేజర్ రన్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు మోడరన్ పెంటాథలాన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. అండర్-9, 11, 13, 15, 17, 19, 21 వయస్సుల వారికి జూనియర్స్ విభాగంలోను, 22 నుంచి 39 సంవత్సరాల వారికి సీనియర్స్ విభాగంలోను, 40 నుంచి 50 సంవత్సరాల వారికి మాస్టర్స్ విభాగంలో, దివ్యంగులకు ప్రత్యేక విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పోటీలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 5 వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయిలో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు 9848411027 నెంబరులో సంప్రదించాలని కోరారు.

### కలెక్టర్‌కు రెడ్‌క్రాస్ అవార్డు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా రెడ్ క్రాస్ శాఖ అధ్యక్షులు, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ప్రతిష్టాత్మక రెడ్ క్రాస్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ బుధవారం విలేకరులకు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో రెడ్ క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో సేవా, సామాజిక చైతన్యవంతమైన కార్యక్రమాల అమలు నేపథ్యంలో గవర్నర్ చేతుల మీదుగా ప్రతి ఏటా అవార్డులను ప్రదానం చేస్తారన్నారు. మన జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.40 లక్షల మేర విరాళాల సేకరించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల కలెక్టర్లకు మాత్రమే ఈ గౌరవం దక్కిందన్నారు. విజయవాడలోని గవర్నర్ బంగ్లాలో మే 8వ తేదీన జరిగే కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్ మాధవీలత అవార్డు అందుకుంటారన్నారు. రెడ్ క్రాస్ విభాగం జిల్లా చైర్మన్ వై.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మానవతా స్ఫూర్తి, సేవాభావాన్ని పెంపొందించేలా జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ విభాగాలు పనిచేస్తున్నాయన్నారు.

# తగ్గిన నిషాచరులు

- 2018-19తో పోలిస్తే తగ్గిన లిక్కర్, బీరు వినియోగం
- క్రమేపీ సత్ఫలితాలిస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలు
- దశలవారీ మద్య నిషేధం దిశగా అడుగులు





సత్ఫలితాలు ఇస్తున్న ప్రభుత్వ ప్రయత్నాలు

అమలాపురం టౌన్: మద్యం బ్రాండ్లు, ధరలు, అమ్మకాలు పెంచేసి తాగుబోతులు మరింత మత్తులో తూగేలా ప్రభుత్వం చేస్తోందని విమర్శించే ప్రతిపక్ష నేతల నోళ్లను మద్యం అమ్మకాల గణంకాలు మూయిస్తున్నాయి. దశలవారీ మద్య నిషేధానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, నిర్ణయాలు కూడా సత్ఫలితాలు ఇస్తున్న క్రమంలో వినియోగంలో తగ్గుదల కనిపిస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏర్పాటయ్యాక అమలాపురంలోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ లిక్కర్ గొడౌన్ (డిపో) నుంచి 2022-23 సంవత్సరంలో జరిగిన మద్యం అమ్మకాలను పరిగణనలోకి తీసుకుంటే అమ్మకాలు పెరిగాయో తగ్గాయో తెలుస్తుంది. టీడీపీ ప్రభుత్వంలో 2018-19 సంవత్సరానికి సంబంధించి ఇదే అమలాపురం గొడౌన్ నుంచి సాగిన అమ్మకాలను 2022-23 సంవత్సరం గణంకాలతో పోల్చితే మద్యం అమ్మకాలు తగ్గుదల స్పష్టంగా కనిపిస్తోంది.

### వినియోగం తగ్గింది

గతంలో పోల్చుకుంటే మద్యం వినియోగం కొంత తగ్గింది. ముఖ్యంగా 2018-19 సంవత్సరంతో పోల్చితే 2022-23 సంవత్సరంలో అమలాపురం లిక్కర్ డిపోలో వినియోగం తగ్గినట్లుగా లెక్కలు చెబుతున్నాయి.

– పొంగులేటి దశమంతరావు, మేనేజర్, అమలాపురం ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిక్కర్ గొడౌన్ (డిపో)

**ఇవీ లెక్కలు..**

కోనసీమ వ్యాప్తంగా ఉన్న 97 దుకాణాలకు అమలాపురం లిక్కర్ గొడౌన్ నుంచి మద్యం సరఫరా అవుతుంది. ఈ గొడౌన్ నుంచి 1918-19 సంవత్సరంలో లిక్కర్ 10.33 లక్షల కేసులను దుకాణాలకు విక్రయించారు. 2022-23 సంవత్సరంలో ఇదే గొడౌన్ నుంచి 8.18 లక్షల కేసుల లిక్కర్ అమ్మకం సాగింది. 2018-19 సంవత్సరంలో ఈ గొడౌన్ నుంచి బీరు 6.77 లక్షల కేసులను దుకాణాలకు విక్రయించగా 2022-23 సంవత్సరంలో సగం కంటే లోపే అంటే కేవలం 2.30 లక్షల కేసుల బీరు విక్రయం అయింది. ఈ అధికారిక గణంకాలు లిక్కర్, బీరు వినియోగం ఏ మేరు తగ్గిందో స్పష్టం చేస్తున్నాయి.

**రాష్ట్రవ్యాప్తంగా 12.61 శాతం మేర తగ్గుముఖం**

అమలాపురం లిక్కర్ డిపో కోనసీమ వ్యాప్తంగా ఉన్న 97 మద్యం దుకాణాలకు సరఫరా చేస్తుంటే కొత్త జిల్లా ఏర్పాటయ్యాక జిల్లా పరిధిలోకి వచ్చే రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలకు సంబంధించి ఉన్న 49 మద్యం దుకాణాలకు రాజమహేంద్రవరం లిక్కర్ గొడౌన్ నుంచి లిక్కర్, బీరు కేసులు సరఫరా అవుతున్నాయి. ఆ రెండు నియోజకవర్గాల్లో కూడా 2018-19 సంవత్సరం పోల్చితే 2022-23 సంవత్సరంలో 20 నుంచి 25 శాతం వరకూ మద్యం వినియోగం తగ్గింది. గత నెల 21న విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖల సమీక్షా సమావేశం కూడా 2018-19 సంవత్సరంతో పోల్చితే 2022-23 సంవత్సరంలో లిక్కరు, బీరు వినియోగం ఎంత మేర తగ్గిందో గణాంకాలను వెల్లడించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా లిక్కర్, బీరు వినియోగం 12.61 శాతం మేర తగ్గుముఖం పట్టినట్లు ఈ గణాంకాలు స్పష్టం చేశాయి.

ఇదే సమయంలో రాష్టంలో మద్యం వినియోగాన్ని క్రమేపీ తగ్గిస్తూ మందుబాబుల ఆలోచనలో మార్పు తీసుకుని రావాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దశలవారీ ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో వీధివీధికి, సందు సందుకీ, గుడి బడి ఎక్కడ పడితే అక్కడ అధికారిక మద్యం దుకాణాలకు తోడు పుట్టగొడుగుల్లా వెలిసిన మద్యం బెల్ట్‌షాపులను ఈ ప్రభుత్వం వచ్చిన కొత్తలోనే మూయించి వేసింది. ప్రభుత్వమే దుకాణాల సంఖ్యను తగ్గించి ఏర్పాటు చేసింది.

### అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు



గిరి ప్రదక్షిణ బస్సును ప్రారంభిస్తున్న డీఎం మూర్తి తదితరులు

అమలాపురం రూరల్: ఆర్టీసీ అమలాపురం డిపో నుంచి బుధవారం 36 మంది భక్తులతో అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సును డీఎం చల్లా సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ టూరులో కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం పుణ్యక్షేత్రం చేరుకుని, పౌర్ణమి నాడు గిరి ప్రదక్షిణ పూర్తి అయిన తరువాత తిరుగు ప్రయాణంలో కంచి, శ్రీకాళహస్తి క్షేత్రాలు దర్శించుకుని అమలాపురం చేరుకుంటుందన్నారు. భక్తులు సౌకర్యార్థం ప్రతి నెలా అమలాపురం డిపో నుంచి పౌర్ణమి నాడు అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. జూన్ 1వ తేదీన డిపో నుంచి ప్రత్యేక బస్సు బయలుదేరుతుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో అడ్వాన్స్డ్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణ చార్జి పెద్దలకు రూ.2,950. పిల్లలకు రూ.2,000, ఇంద్ర ఏసీ బస్సులో పెద్దలకు రూ.4,000, పిల్లలకు రూ.3,000 అని తెలిపారు. ఆసక్తి గల ప్రయాణికులు 70138 68687, 73829 09798, 99592 25550, 99592 25576 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని, అమలాపురం డిపో మేనేజర్ మూర్తి తెలిపారు.

## జిల్లా నేతలతో మిథున్‌రెడ్డి భేటీ



జిల్లా పార్టీ నేతలతో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

అమలాపురం టౌన్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ నూతన గృహ ప్రవేశ వేడుకకు హాజరైన వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అమలాపురంలోని ముమ్మిడివరం ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్ కుమార్ స్వగృహంలో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో బుధవారం కొద్ది సేపు భేటీ అయ్యారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేయడం, ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో అనుసరించాల్సిన వ్యూహాలపై మిథున్‌రెడ్డి అంతర్గతంగా చర్చించినట్లు తెలిసింది. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, కొండేపూడి చిట్టిబాబు, రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్‌తో పాటు మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. తొలుత తన ఇంటికి వచ్చిన మిథున్‌రెడ్డికి ఎమ్మెల్యే పొన్నాడ దంపతులు స్వాగతం పలికారు.

## ఎవరెస్టు శిఖరం అధిరోహించిన శ్రీనివాస్

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి పాల డైరీలో పని చేస్తున్న కానూరి శ్రీనివాస్ ఇటీవల ఎవరెస్టు బేస్ క్యాంపులో 5364 మీటర్ల ట్రెక్కింగ్ చేసి జాతీయ జెండా ఎగురవేశాడు. గతనెల 16న నేపాల్‌లో లుక్ల ప్రాంతం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభించాడు. వారం రోజులకు ఎవరెస్టు బేస్ క్యాంపునకు చేరుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఎప్పటి నుంచో ఎవరెస్టు శిఖరం అధిరోహించాలన్న ఆకాంక్ష నెరవేరిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



ఎవరెస్టు శిఖరంపై శ్రీనివాస్

## ఉప్పు ద్రావణంతో ముప్పు తప్పుతుంది

- వరి పనల రక్షణకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచన
- ఆర్బీకేల్లో బ్యాటరీలతో పనిచేసే 1,769 స్ప్రేయింగ్ మెషీన్లు రెడీ



కె.గంగవరంలో తడిసిన వరి పనలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రైతు

అమలాపురం టౌన్: జిల్లాలో కురిసిన అకాల వర్షాల వల్ల పనల మీద ఉన్న వరిని సంరక్షించుకుని కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం ఆదేశాలు జారీ చేశారు. వర్షం కురిసిన నాలుగు రోజులుగా కలెక్టర్ శుక్లా జిల్లాలోని పలు శాఖల అధికారులతో ధాన్యాన్ని సంరక్షించుకునేందుకు అవసరమైన చర్యలను నిరతంతర పర్యవేక్షిస్తూనే ఉన్నారు. వర్షాల వల్ల తడిసిన వరి పనలపై మొలకలు రాకుండా, రంగు మారకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని కలెక్టర్ శుక్లా రైతులకు సూచించారు. ఇందు కోసం జిల్లాలోని ఆర్బీకేల్లో స్ప్రేయింగ్ మెషీన్లను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఇందు కోసం జిల్లాలోని కొందరు ప్రైవేటు వ్యక్తుల నుంచి స్ప్రేయింగ్ మెషీన్లు తీసుకుని ఆర్బీకేలకు వాటిని అనుసంధానం చేశామని వెల్లడించారు. ఇప్పటిదాకా అమలాపురం డివిజన్‌లో 646, కొత్తపేట డివిజన్‌లో 472, రామచంద్రపురం డివిజన్‌లో 651 చొప్పున జిల్లాలో మొత్తం 1,769 స్ప్రేయింగ్ మెషీన్లను సేకరించి ఆర్బీకేల్లో ఉంచామని వివరించారు. ఈ మెషీన్లు డీజిల్, పెట్రోలు అవసరం లేకుండా బ్యాటరీ ఆధారంగా పనిచేస్తాయని చెప్పారు. ఈ వెసులబాటు వల్ల రైతులకు ఆయిల్ వ్యయ భారం ఉండదని స్పష్టం చేశారు. జిల్లాలో ఈ దాళ్వా సీజన్‌లో 1.72 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటిదాకా 77 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని కలెక్టర్ శుక్లా వెల్లడించారు. రెండు రోజులుగా ఉపాధి కూలీలను వినియోగించి పనల మీద ఉన్న ధాన్యాన్ని సంరక్షించామని వివరించారు. వచ్చే రెండు రోజులూ వర్షం పడే అవకాశాలు ఉన్న దృష్ట్యా అవసరమైన చోట్ల రైతులు ఉపాధి హామీ కూలీలను ఉపయోగించుకుని వరి పనలపై స్ప్రేయింగ్ చేసే ప్రక్రియను కొనసాగిస్తామన్నారు. ఆర్బీకేల్లో ఉండే స్ప్రేయింగ్ మెషీన్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శుక్లా సూచించారు.

## ఒకటో తరగతికి రెండో విడత నోటిఫికేషన్

- పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య
- 15 వరకు సీఎస్ఈ పోర్టల్‌లో దరఖాస్తుకు అవకాశం
- 22న లాటరీ ద్వారా అర్హుల జాబితా ఎంపిక



రాయవరం: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1)(సి) అమల్లో భాగంగా నిరుపేద విద్యార్థులకు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిన విషయం విదితమే. ఇందులో భాగంగా 2022-23 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించి, మొదటి విడతను విజయవంతంగా పూర్తి చేశారు. రెండో విడతకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మొదటి విడతలో 555 మంది విద్యార్థులకు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం కల్పిస్తూ జాబితాను విడుదల చేయగా, 451 మంది విద్యార్థులు వారికి కేటాయించిన పాఠశాలల్లో ప్రవేశం పొందారు.

**రెండో విడత లాటరీ ప్రక్రియ**

అమరావతిలోని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఎంపిక ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర విద్యాశాఖ పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించింది. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పేదలకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంది. గతం నుంచే చట్టం ఉన్నప్పటికీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తోంది. గత విద్యా సంవత్సరంలో కూడా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ చట్టాన్ని అమలు చేసి 570 మంది విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించారు. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి ప్రవేశానికి ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే నోటిఫికేషన్ విడుదల చేసి, మొదటి విడత జాబితాను విడుదల చేసి, రెండవ విడతకు నోటిఫికేషన్ విడుదల చేయడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లాలో పరిస్థితి ఇదీ..**

జిల్లా పరిధిలో 343 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం మేర పేద విద్యార్థులకు ఉచితంగా సీట్లు కేటాయించారు. 22 మండలాల పరిధిలో 1,879 మంది తమ చిన్నారులకు ఒకటో తరగతిలో ప్రవేశం కోసం సీఎస్ఈ వెబ్ సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకున్నారు. 1,285 మంది తల్లిదండ్రులు మాత్రం వారి చిన్నారుల ప్రవేశం కోరే పాఠశాలలను ఎంపిక చేసుకున్నారు. మొదటి విడతో 555 మందికి అవకాశం లభించింది. తొలివిడత జాబితాలో ఎంపికైన వారు ఏప్రిల్ 27వ తేదీ వరకు పాఠశాల్లో చేరవచ్చు. ఈ నెల 6 నుంచి 15వ తేదీ వరకు రెండో విడతలో సీఎస్ఈ వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 22న లాటరీ ద్వారా అర్హుల జాబితాను ప్రకటిస్తారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 28వ తేదీలోగా వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంది.

### ప్రభుత్వ ఆదేశాల ప్రకారం



విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండో విడతకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలి. నోటిఫికేషన్‌పై మండల విద్యాశాఖాధికారులు విస్తృతమైన ప్రచారం కల్పించాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

## జనగణనకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలి




కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

**రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆదేశం**

అమలాపురం టౌన్: జనాభా గణనకు సంబంధించి జిల్లాకు కేటాయించిన నిధుల వినియోగంపై బిల్లులు సమర్పించి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు వెంటనే జారీ చేయాలని రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కేఎస్ ప్రవీణ్‌కుమార్ జిల్లా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జనాభా గణనపై జిల్లా రెవెన్యూ అధికారులతో బుధవారం సాయంత్రం ఆయన సమీక్షించారు. జనాభా గణన కోసం కేటాయించిన నిధులను ఎప్పటికప్పుడు వినియోగిస్తూ మిగులు నిధులు ఉంటే సరెండర్ చేయాలని సూచించారు. లేని పక్షంలో భవిష్యత్తులో నిధులు విడుదల కావని ఆయన స్పష్టం చేశారు. ఖర్చు చేసిన మేరకు ఎప్పటికప్పుడు బిల్లులు సమర్పించి మంజూరు కోరాలని సూచించారు. యుటిలైజేషన్ ధ్రువపత్రాలు దాఖలు చేయాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, అమలాపురం మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీ విశ్వేశ్వరరావు, అమలాపురం తహసీల్దార్ పరమట శ్రీపల్లివి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ముగిసిన రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి శ్రీమార్కండేయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో 16వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు మంగళవారం రాత్రితో ఘనంగా ముగిసాయి. స్థానిక అపర్ణా కళా తోరణం శ్రీబత్తుల మురళీ కృష్ణ కళావేదికపై గత నెల 30వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నాటక రంగంలో గుర్తింపు పొందిన కళాకారులు పాల్గొన్నారు . కొత్త పరిమళం, రైతేరాజు, చీకటి పువ్వు, నాన్నా నేనొచ్చేస్తా, వెండి అంచులు, గమ్యస్థానాల వైపు, కాపలా తదితర నాటిక ప్రదర్శనలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకున్నాయి. బుధవారం ముగింపు సమావేశం నిర్వహించి నటులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో న్యాయనిర్ణేతలు రాజా తాతయ్య, చల్లా సత్యనారాయణ, లొల్ల సత్యనారాయణ, పడాల రవి, జక్కా సాంబశివరావు, దాసం కామరాజు పాల్గొన్నారు.

### ఎంటీఎస్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక


ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): 98 (ఎంటీఎస్) డీఎస్సీ ఉపాధ్యాయుల ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక బుధవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా చొల్లంగి కేశవకుమార్, కార్యదర్శిగా కోటిపల్లి రాంబాబు, కోశాధికారిగా పెంకే సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మొదటి సమావేశం ఏర్పాటు చేసి ముందుగా తమకు ఉద్యోగ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేసి ప్రతి ఒక్కరూ ఆయన వెన్నంటి ఉండాలని తీర్మానించారు. ఇటీవల ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఉద్యోగులు అందరూ దాదాపు 50 సంవత్సరాలు పైబడిన వారని, సమీప మండలంలో వారిని నియమించాలని కోరుతూ డీఈఓకు వినతిపత్రం అందజేశారు.

# పేద విద్యార్థులకు 'పీఎం యశస్వి'

- కేంద్ర ప్రభుత్వ వినూత్న ఉపకార వేతన పథకం
- ఆగస్టు 26 వరకు దరఖాస్తుకు అవకాశం

రాయవరం: పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కేంద్ర ప్రభుత్వం 'పీఎం యశస్వి'పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఆర్థికంగా వెనుకబాటుతనం ఉన్నవారి కలలను ఈ పథకం ద్వారా నెరవేర్చుకునే వీలుంది. ప్రతిభ ఉండి నిస్సహాయ పరిస్థితుల్లో చదువును మధ్యలో ఆపేసి ఉపాధి బాట పట్టే వారి కోసం కేంద్ర ప్రభుత్వం ఓ వినూత్న కార్యక్రమానికి 'పీఎం యశస్వి' పేరుతో గతేడాది రూపకల్పన చేసింది. యశస్వి అంటే 'యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా'. ఇప్పటి వరకు ఉన్న అతి పెద్ద ఉపకార వేతన పథకాల్లో 'పీఎం యశస్వి' కూడా ఒకటి. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయ, సాధికారిక మంత్రిత్వ శాఖ పరిధిలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ పథకానికి ఆధ్వర్యం వహిస్తోంది.



### అర్హులు ఎవరంటే..

- కేంద్ర విద్యాశాఖ అధికారి ఎన్‌టీ ఏ వెబ్‌సైట్‌లో నిర్వహించే యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి.
- ప్రవేశ పరీక్ష రాసేందుకు 8వ తరగతి పూర్తి చేసి ఉండాలి.
- 9,10 తరగతులు పూర్తయిన వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. వారికి మిగిలిన సంవత్సరాలకు (ఇంటర్ వరకు) మాత్రమే స్కాలర్ షిప్ లభిస్తుంది.
- ఓబీసీ, ఈబీసీ తరగతులకు చెందినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. - 9వ తరగతిలో దరఖాస్తు చేసుకునే వారు 2004 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2008 మార్చి 31లోపు జన్మించి ఉండాలి.
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించి ఉండరాదు.


గ్రామాల్లోని నిరుపేదలు, రైతులు, అణగారిన కుటుంబాల్లోని విద్యార్థులకు ప్రాధాన్యమిస్తారు.

### దరఖాస్తు ఇలా..

ప్రవేశ పరీక్ష రాయడానికి ఎన్‌టీ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి. పేరు, ఈ-మెయిల్ అడ్రస్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితరాలతో ఓ ఖాతాను క్రియేట్ చేసుకోవాలి. తర్వాత దరఖాస్తుదారునికి అప్లికేషన్ నంబరు వస్తుంది. అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి. చదువు, గుర్తింపు కార్డు తదితర వివరాల డాక్యుమెంట్ల సాఫ్ట్ కాపీలను అప్‌లోడ్ చేసి సైన్ అప్ కావాలి. అంతటితో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. పరీక్ష, ప్రవేశ కార్డు జారీ చేసే తేదీ తదితర వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చు.

### పరీక్ష నిర్వహిస్తారిలా

మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు కొనసాగే పరీక్షలను హిందీ, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహిస్తారు. ప్రవేశ రుసుం లేదు. 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. గణితంలో 120 మార్కులకు 30 ప్రశ్నలు, సైన్సులో 80 మార్కులకు 20 ప్రశ్నలు, సోషల్‌లో 100 మార్కులకు 25 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్‌లో 100 మార్కులకు మరో 25 ప్రశ్నలుంటాయి. దేశవ్యాప్తంగా 78 ప్రధాన నగరాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. గతేడాది సెప్టెంబరు 11న ఈ పరీక్షలు నిర్వహించారు. ఏప్రిల్ 15 నుంచి ఈ ఏడాది నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా, ఆగస్టు 26తో దరఖాస్తు ప్రక్రియ పూర్తికానుంది.



పీఎం యశస్వి లోగో

### ఉపకార వేతనం ఎంత?

9, 10 తరగతులకు ఏటా రూ.75 వేలు, ఇంటర్మీడియెట్ లేదా 11,12 తరగతులకు ఏటా రూ.1.25 లక్షలు ఉపకార వేతనం ఒకేసారి అందిస్తారు.

### అర్హత సాధించిన తర్వాత

విద్యార్థులు మళ్లీ ఉపకార వేతనం కోసం అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏ బ్యాంకు ద్వారా పొందాలనుకుంటారో ఆ బ్యాంకు పాస్ పుస్తకం ఫొటో కాపీని జత చేయాలి. ఉపకార వేతనం నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. వీటితో కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల, కళాశాలలో అయినా విద్యార్థులు విద్యనభ్యసించవచ్చు.

### రూ.10 లక్షల కోట్ల వ్యాపారం అధిగమించాం

- ఇండియన్ బ్యాంక్ దివాన్ చెరువు 65వ శాఖ ప్రారంభం
- ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేష్ రామన్


దివాన్ చెరువు శాఖను ప్రారంభిస్తున్న జీఎం గణేష్ రామన్

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ బ్యాంక్ రూ.10 లక్షల కోట్ల వ్యాపారాన్ని అధిగమించిందని ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేష్ రామన్ పేర్కొన్నారు. బుధవారం ఇండియన్ బ్యాంక్ 56వ శాఖగా లాలాచెరువులో ఏర్పాటు చేసిన దివాన్ చెరువు శాఖను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు కోరుకున్న కొత్త పథకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ప్రధానంగా స్వంత ఇంటి కల నెరవేర్చేందుకు ఖాతాదారులకు అతి తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు అందజేస్తున్నామన్నారు. జోనల్ మేనేజర్ సుధాకర రావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం జోన్ పరిధిలో పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలు ఉన్నాయన్నారు. ప్రస్తుత ఐదు జిల్లాల్లో 65వ శాఖగా లాలాచెరువు బ్రాంచి ప్రారంభోత్సవం జరిగిందన్నారు. జోన్ మొత్తం మీద రూ.7,819 కోట్ల వ్యాపారం సాగిస్తున్నామన్నారు. ఎస్‌హెజీసీ గ్రూపులకు రూ.250 కోట్లు రుణాలు అందజేశామన్నారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీలకు రూ.135 కోట్లు, వ్యవసాయరంగానికి రూ.616 కోట్లు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎం దుర్గా వరాహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో యువకుడి మృతి


రాంబాబు మృతదేహం

పి.గన్నవరం: మండలంలోని ముంగండ గ్రామంలో బుధవారం కూలి పనులు చేస్తున్న ఒక యువకుడు విద్యుధాఘాతానికి గురై మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంగండ గ్రామానికి చెందిన బీర రాంబాబు (25) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం అతను బంధువుల ఇంటి వద్ద పని చేస్తున్నాడు. అప్పటికే వాటర్ మోటారుకు ఉన్న విద్యుత్ వైరు తెగి కింద పడిపోయింది. ఆ వైరు రాంబాబు చేతికి తగలడంతో అతడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాంబాబుకు వివాహం కాలేదు. అతడి తండ్రి గతంలో చనిపోవడంతో తల్లి విజయను తానే పోషిస్తున్నాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లి విజయ కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుని కుటుంబాన్ని ఎంపీపీ అంబటి భూలక్ష్మి, సర్పంచ్ కుసుమ చంద్రకళ పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# దేవస్థానం సూపరింటెండెంట్ నగేష్ ఇళ్లపై ఏసీబీ దాడులు


ద్వారకాతిరుమలలో నగేష్ అపార్ట్‌మెంట్


ద్వారకాతిరుమలలోని నగేష్ అపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు


నిడదవోలులో సురేష్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

- ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో సోదాలు
- పలు విలువైన డాక్యుమెంట్లు స్వాధీనం

ద్వారకాతిరుమల: స్థానిక వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం నుంచి, విజయవాడ దుర్గ గుడికి 2022 జులై 1న బదిలీపై వెళ్లిన సూపరింటెండెంట్ వాసా నగేష్ ఇళ్లపై ఏసీబీ అధికారులు బుధవారం ఉదయం దాడి చేశారు. పలు ప్రాంతాల్లోని ఆయన బంధువుల ఇళ్లపై సైతం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. నగేష్ ఆదాయానికి మించి అక్రమంగా ఆస్తులు కూడబెట్టాడన్న సమాచారంతో ఏసీబీ అధికారులు ఏలూరు జిల్లా భీమడోలులోని అతని బంధువుల ఇళ్లల్లో, ద్వారకాతిరుమలలో నగేష్‌కు చెందిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర అపార్ట్‌మెంట్, విజయవాడ భవానీపురంలో అద్దెకుంటున్న లోటస్ లెజెండ్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లో సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంతో విలువైన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. కాగా ద్వారకాతిరుమలలోని అపార్ట్‌మెంట్‌లో ఏలూరు ఏసీబీ డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించిన ఏసీబీ సీఐ, ఎస్సై, సిబ్బంది అపార్ట్‌మెంట్ విస్తీర్ణం ఎంత, విలువ ఎంత, దాన్ని ఎప్పుడు నిర్మించారు వంటి వివరాలను సేకరించారు. అనంతరం స్థానిక కెనరా, యూనియన్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుల్లోని అకౌంట్లను, లాకర్లను తనిఖీ చేశారు.

**నిడదవోలులోనూ తనిఖీలు**

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో సూపరింటెండెంట్ వాసా నగేష్ సోదరుడు, దస్తావేజీల లేఖరి వాసా సురేష్ ఇంట్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు దస్తావేజులు, భూములకు సంబంధించి పలు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అదే సమయంలో వాసా సురేష్ ఆస్తులకు సంబంధించిన పలు వివరాలను ఏసీబీ అధికారులకు చెప్పారు. రాజమహేంద్రవరం ఏసీబీ సీఐ సతీష్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యుల బృందం ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏసీబీ సీఐ సతీష్ మాట్లాడుతూ సూపరింటెండెంట్ వాసా నగేష్‌కు సంబంధించిన పలు ఆస్తులు, దస్తావేజులను పరిశీలించామని, వాటి వివరాలతో నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.


వాసా నగేష్ (ఫైల్)

# రత్నగిరిపై వేదఘోష


సదస్యంలో వేద మంత్రాలు పఠిస్తున్న పండితులు

అన్నవరం : రత్నగిరి శ్రీసత్యదేవుని సన్నిధి బుధవారం వేదఘోషతో ప్రతిధ్వనించింది. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో సాయంత్రం నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల సమక్షంలో వేదపండిత సదస్యం ఘనంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వేద, స్మార్త పండితులు స్వామివారి ముందు తమ వేద విద్వత్తును ప్రదర్శించారు. ఈ సందర్భంగా 150 మంది పండితులను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు సత్కరించారు. మధ్యాహ్నం మూడు గంటలకు నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను పెళ్లిపెద్దలు సీతారాములు వెంట రాగా నిత్య కల్యాణ మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి అక్కడి వేదిక మీద ప్రతిష్ఠించారు. అనంతరం స్వామి అమ్మవార్లను సర్వాంగసుందరంగా అలంకరించి పూజలు చేసిన తరువాత పండిత సదస్యాన్ని ప్రారంభించారు. సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణం పండితుల వేద మంత్రాలతో మార్మోగింది. పండితులు స్వామివారి ముందు నాలుగు వేదాలు పఠించారు. తరువాత దేవస్థానం వేదపండితులు సత్యదేవుడు, అమ్మవార్లకు వేదాశీస్సులందజేశారు.

**పండిత సత్కారం**

అనంతరం వేద పండితులను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు ఘనంగా సత్కరించారు. తొలుత ప్రముఖ పండితులు మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, గుళ్లపల్లి శ్రీరామచంద్ర ఘనాపాఠీ, చిర్రావూరి శ్రీరామశర్మ, తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు కె.సోమయాజీలను నగదు కానుక, స్వామివారి ప్రసాదం, మామిడిపండ్లతో సత్కరించారు. తరువాత మిగిలిన పండితులను సత్కరించారు. దేవస్థానం విశ్రాంత వేదపండితులు ముష్టి కామశాస్త్రి, విశ్రాంతి ప్రధానార్చకులు నాగాభట్ల సత్యనారాయణ, విశ్రాంత వ్రత పురోహిత సూపర్‌వైజర్ నాగాభట్ల కామేశ్వరశర్మ, విశ్రాంత వ్రతపురోహితులను కూడా సత్కరించారు. వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట శ్రీనివాస్, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్, అర్చకస్వాములు ఇంద్రగంటి వేంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, సుధీర్, ముత్య వేంకట్రావు పాల్గొన్నారు.

### 7న జూనియర్ వాలీబాల్ సెలెక్షన్స్

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలుర, బాలికల సబ్ జూనియర్ వాలీబాల్ క్రీడా సెలెక్షన్స్ ఈ నెల 7వ తేదీన రావులపాలెం ప్రభుత్వ కళాశాలలో జరుగుతాయని ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రామరాజు, కార్యదర్శి కె.యశ్వంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెలెక్షన్స్‌లో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టి ఉండాలి. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలి. ఈ సెలెక్షన్స్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతాయని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు ఆ రోజు మధ్యాహ్నం రెండు గంటల లోపు రావులపాలెం ప్రభుత్వ కళాశాల వద్ద నిర్వాహకులకు రిపోర్ట్ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు 94404 41044, 90002 89917 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.